క్లుప్తంగా

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని గోరంట్ల గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో కీళ్లనొప్పులు, డిస్క్ సమస్యలు, సయాటికా, సెక్స్ సమస్యలు, పక్షవాతం, స్పాండిలైటిస్, సొరియాసిస్, చర్మవ్యాధులు, అధిక బరువు, మోకాళ్ల అరుగుదల, పైల్స్, జీర్ణ సమస్యలు తదితర వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను రూరల్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ రైటర్ నరేష్ తెలిపిన వివరాలు.. గుంటూరు నుంచి కొల్లూరు బాడుగ ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మండల పరిధిలోని బ్రాహ్మణ కోడూరు వద్ద రూరల్ ఎస్ఐ కిరణ్‌బాబు బియ్యం ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో 50 బస్తాల బియ్యం ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం



పొన్నూరు: ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో రెండు గుడిసెలు దగ్ధమైన ఘటన శనివారం మండలంలోని దొప్పలపూడిలో చోటుచేసుకుంది. ఆర్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. గ్రామంలోని కావూరు పూర్ణ చంద్రరావు ఇల్లు పూర్తిగా దగ్ధమైందని, కొంత నగదు కూడా కాలిపోయినట్లు తెలిపారు. జున్ను శివపార్వతికి చెందిన గుడిసె పాక్షికంగా కాలిందని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులో తీసుకొచ్చిన ఫలితం లేకుండా పోయింది.

ఉచిత కంటి వైద్య శిబిరం



గుంటూరు రూరల్: కళ్లు మనిషి శరీరంలో ఎంతో ప్రధానమైనవని వాటిని మనం ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని గోర్లవారిపాలెం సర్పంచి నల్లమేకల అప్పమ్మమాధవరావు తెలిపారు. శనివారం గొర్లవారిపాలెం గ్రామంలో వాసన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అర్హులకు కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. అదే విధంగా శస్త్ర చికిత్సలు అవసరమైనవారికి మెరుగైన చికిత్సలకు రిఫర్ చేశారు. గ్రామంలోని 400 మందికి ఉచిత పరీక్షలు చేసి మందులు అందజేశారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్



పొన్నూరు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మొగసాటి శ్రీనివాస్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఇద్దరికి గాయాలు

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులు గాయాలపాలైన ఘటన జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చిలుకూరి అమల, పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడికి చెందిన మక్కెన దివ్య ఇద్దరూ స్నేహితులు. దివ్య హైదరాబాద్‌లోని మెడికల్ కోడింగ్ జాబ్ చేస్తోంది. వీకెండ్ సెలవు కావడంతో శనివారం దివ్య తెనాలిలోని స్నేహితురాలు అమల వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి స్నేహితురాళ్లిద్దరూ మురికిపూడికి స్కూటీపై వెళుతున్నారు. అదే సమయంలో ప్రత్తిపాడు మండలం యనమదల 16వ నంబరు జాతీయ రహదారిపై ముందు వెళుతున్న కారు సడన్‌గా లెఫ్ట్ సైడ్‌కు రావడంతో వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దివ్యకు గాయాలవ్వగా, అమల పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. అయితే ఆస్పత్రి నుంచి ఇంటిమేషన్ రాలేదని, వచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర తెలిపారు.

'క్షయ'పై శిక్షణ తరగతులు

గుంటూరు మెడికల్: జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్‌లకు క్షయ వ్యాధిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శనివారం తెలిపారు. ప్రజల్లో క్షయ, కుష్ఠు వ్యాధులపై ఉన్న అపోహలను తొలగించి, సకాలంలో వ్యాధి బాధితులను గుర్తించేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.

హవ్వ.. నవ్వీపోదురు

- బీఎల్‌ఓలు 99 శాతం ఇంటింటి సర్వే చేశారట!
- ఎప్పుడొచ్చారో తెలియదు.. ఎక్కడ చేశారో తెలియదు
- కానీ ప్రతి మండలంలోనూ సర్వే 98 శాతం దాటినట్లు గణాంకాలు
- పర్యవేక్షణ కొరవడటంతో సర్వే చేయకుండానే చేసినట్లుగా లెక్కలు



ప్రత్తిపాడులో ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు (ఫైల్)

ప్రత్తిపాడు: ఓటు నమోదు ప్రక్రియపై ఎన్నికల సంఘం మరో సారి దృష్టి సారించింది. స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో భాగంగా ఓటర్ల జాబితాలో సవరణలకు అవకాశం కల్పించింది. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల వివరాలను సేకరించడంతో పాటు, ప్రస్తుతం ఉన్న ఓటర్లకు సంబంధించి సరిచేయాల్సిన మార్పులు చేర్పులపై సర్వే చేయాల్సి ఉంది. సర్వేలో జాబితాలో ఉన్న మృతులు, శాశ్వత వలస ఓటర్లు, తప్పులు, చిరునామా, ఫొటోల మార్పులు.. వంటి వాటికి సంబంధించి బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరించాలి. కానీ ఈ సర్వే క్షేత్రస్థాయిలో ఎక్కడా జరిగిన దాఖలాలు లేవు. బీఎల్‌ఓల్లో దాదాపుగా 95 శాతం మంది కార్యాలయాల గడప కూడా దాటకుండానే సర్వేను 99 శాతం పూర్తి చేసినట్లుగా ఎన్నికల సంఘానికి లెక్కలు పంపారు.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ..

బీఎల్‌ఓల ఇంటింటి సర్వేపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నాలుగు నెలల కిందటనే సార్వత్రిక ఎన్నికలు జరిగి ఉండటం, అప్పట్లోనే తుది ఓటర్ల జాబితాను ప్రకటించడంతో మరలా నాలుగు నెలల్లోనే మార్పులు ఏముంటాయకున్నారో..? ఏమో గానీ ఓటర్ల ఇంటి గడప తొక్కకుండానే కార్యాలయాల్లో కూర్చుని సర్వేను ముగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో సర్వే బీఎల్‌ఓల ఇష్టానుసారంగా నడిచిపోయింది. దానికి తోడు అధికారులంతా బదిలీల హడివిడిలో ఉండటం కూడా కలిసొచ్చింది. అడిగేవారు లేకపోవడంతో సర్వేకు రాకుండానే సర్వే చేసినట్లుగా లెక్కలు చూపిస్తున్నారు.

కార్యాలయాల్లో కూర్చుని సర్వే



ఇంటింటికీ తిరిగి చేయాల్సిన సర్వేను అధికశాతం మంది బీఎల్‌ఓలు కార్యాలయాలు, సచివాలయాల్లో కూర్చుని ముగించారు. ఇంటికొచ్చి సర్వే చేస్తే మృతులు ఎవరో, ఓటరు ఎవరో తెలుస్తుంది. తప్పులను సరిచేసి పారదర్శకమైన ఓటరు జాబితా వస్తుంది. ఇలా ఇంటింటి సర్వేకు రాకుండా, ఆఫీసుల్లో కూర్చుని చేస్తే జాబితాలో తప్పుల సవరణ ఎలా సాధ్యం.

– ఉడుతూరి ఓంప్రకాష్‌రెడ్డి, ప్రత్తిపాడు

ఎప్పుడెప్పుడు ఏమేం చేస్తారంటే..

స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా అక్టోబరు 18 వరకు సర్వే చేస్తారు. 29వ తేదీన ముసాయిదా జాబితా విడుదల, నవంబరు 28 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబరు 24 వరకు పరిష్కారాలు, 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేయాల్సి ఉంది.

నియోజక వర్గంలో ఓటర్లు, పోలింగ్ బూత్‌ల వివరాలు..

మండలం	ఓటర్లు	పోలింగ్ బూత్‌లు	బీఎల్‌ఓల సర్వేశాతం
ప్రత్తిపాడు	40,763	47	99.47
వట్టిచెరుకూరు	38,196	45	99.80
గుంటూరు రూరల్	1,19,815	110	98.94
పెదనందిపాడు	34,999	41	99.93
కాకుమాను	34,561	42	99.67
మొత్తం	2,68,334	285	99.48

భారీగా ఉద్యోగుల బదిలీలు

- పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు స్థానచలనం
- కొత్తగా విధుల్లోకి చేరిన పలు శాఖల ఉద్యోగులు



సచివాలయ ఉద్యోగులకు రిలీవింగ్ ఆర్డర్లు అందజేస్తున్న ఎంపీడీఓ శివపార్వతి

ప్రత్తిపాడు: కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత మండలంలో భారీగా బదిలీలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో ఆయా గ్రామ పంచాయతీలు, సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు స్థాన చలనం కలిగింది. అనేక మంది ఉద్యోగులకు పార్టీ రంగు పులిమి ఆయా గ్రామాల తెలుగు దేశం నేతలు బదిలీకి రెకమండేషన్లు చేయడంతో వారి స్థానాల్లో కొత్తవారు కొలువు దీరుతున్నారు. ప్రత్తిపాడు మండలంలో పంచాయతీ కార్యదర్శులు జాన్‌పీరా, నాగిరెడ్డి, శ్వేత, శ్రీదేవి, కృష్ణకుమారి, విజయశ్రీ పక్క మండలాలకు బదిలీపై వెళ్లగా, ఖాజా, లక్ష్మీప్రసన్న ఇదే మండలంలోని వేరే పంచాయతీలకు బదిలీ అయ్యారు. కాగా పలు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు బదిలీపై ఇతర మండలాలకు వెళ్లడంతో వారి స్థానంలో కొత్తవారు విధుల్లో చేరుతున్నారు. శుక్ర, శనివారాల్లో వివిధ మండలాల నుంచి బదిలీపై వచ్చిన వారు విధుల్లో చేరారు. జాయినింగ్ ఆర్డర్లను ఎంపీడీఓ కె. శివపార్వతికి అందజేశారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలందించాలని ఎంపీడీఓ విధుల్లో చేరిన ఉద్యోగులకు సూచించారు. కాగా మండలం నుంచి బదిలీ అయిన వారికి ఎంపీడీఓ రిలీవింగ్ ఆర్డర్లు అందించారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా ఎం.ఎస్.కె.ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్‌గా సయ్యద్ సుభాని, ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా విజయవర్ధిని, గొట్టిపాడు జూనియర్ అసిస్టెంటుగా రామ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈగా వెంకటరత్నం విధుల్లో చేరారు. మొత్తం 34 మంది ఉద్యోగులు వచ్చి చేరగా 17 మంది ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లారు.

స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- కిట్స్ కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు
- ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న కళాశాల ఛైర్మన్ సుబ్బారావు

ప్రత్తిపాడు: ఇంజినీరింగ్ విద్యార్థులు స్వశక్తితో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కిట్స్ కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(కిట్స్ కళాశాల)లో 2024–25 బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు వీలుగా అనేక రకాల విభాగాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కేవలం ఉపాధి దిశగా మాత్రమే కాకుండా, విద్యార్థులు తమ స్వశక్తితో, తెలివితేటలతో పారిశ్రామికవేత్తలుగా స్థిరపడటానికి కావాల్సిన నైపుణ్యాలను అందిస్తామని వివరించారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణను అలవరుచుకుని, తల్లిదండ్రుల ఆశయాలను సాకారం చేసేలా లక్ష్యం దిశగా పయనం సాగించాలని విద్యార్థులకు సూచించారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్సులు, స్కిట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు పాల్గొన్నారు.

15 మంది 'మిట్టపల్లి' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని తుమ్మలపాలెం మిట్టపల్లి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్యూ స్పైడర్స్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న సీఎస్ఈ, ఈసీఈ విద్యార్థినులకు కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు ఆయా విభాగాల్లో ఇంటర్వ్యూలు జరిపి పదిహేను మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులకు ఏడాదికి నాలుగు నుంచి తొమ్మిదిన్నర లక్షల వార్షిక వేతనం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎంబీవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రవికాంత్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల టీపీవో, ఏవో సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు గుంటూరు కేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శనివారం రెండు రోజు ఉత్సాహంగా కొనసాగాయి. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంతో పాటు శ్రీపాటిబండ్ల సీతారామయ్య స్కూల్ క్రీడా మైదానంలో క్రికెట్, జావిలిన్ త్రో, షటిల్ డబుల్, షాట్‌పుట్, వాకింగ్, రన్నింగ్ వంటి ఈవెంట్స్, గేమ్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పోటీల విజేతలకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ బహుమతులుఅందజేశారు. శనివారం జరిగిన పోటీల్లో గెలిచిన ఉపాధ్యాయులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, ఏఎస్ కుసుమ కుమారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ పాల్గొన్నారు.

చేబ్రోలు మండలంలో కార్యదర్శుల బాధ్యతల స్వీకారం



శ్రీనివాసరావు, చేబ్రోలు



సుబాష్‌చంద్రబోస్, వడ్లమూడి



శ్రీనివాసరావు, సుద్దపల్లి

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు వివిధ ప్రాంతాలకు బదిలీ కావటంతో రిలీవ్ అయి వెళ్లిపోయారు. వారి స్థానంలో కొత్తగా పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ కె.లలిత తెలిపారు.

- చేబ్రోలు మండల ఈఓపీఆర్డీగా టి.ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లూరు నుంచి చేబ్రోలుకు బదిలీపై వచ్చారు.
- చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కారసాని శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ చేబ్రోలుకు బదిలీపై వచ్చారు.
- గొడవర్రు పంచాయతీ కార్యదర్శిగా బి.సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన వట్టిచెరుకూరు మండలం ముట్లూరు–1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ గొడవర్రుకు బదిలీపై వచ్చారు.
- మంచాల పంచాయతీ కార్యదర్శిగా జీవీ సుబ్రహ్మణ్యం, వీరనాయకునిపాలెం పంచాయతీ కార్యదర్శిగా వాకా సుజన, వడ్లమూడి మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా జి.సుభాష్ చంద్రబోస్, సుద్దపల్లి పపంచాయతీ కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు, వేజండ్ల పంచాయతీ కార్యదర్శిగా ఎస్.వేణుగోపాలరావు బాధ్యతలు స్వీకరించారు.

పేద మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వండి

వెలుగు ఏపీఎం లాజరు

ప్రత్తిపాడు: పేద మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందించాలని బ్యాంకర్లను వెలుగు ఏపీఎం వి.లాజరు కోరారు. మండల పరిధిలోని యనమదల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సాయి సందీప్, ప్రత్తిపాడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ మేనేజర్ అజయ్‌లను శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఇప్పటి వరకూ బ్యాంకర్లు మాన్యువల్ ఎంసీపీ తీసుకుని రుణాల మంజూరు చేస్తున్నారని, దాని వలన డ్వాక్రా మహిళలు ప్రభుత్వం ఇచ్చే సున్నా వడ్డీ రాయితీని కోల్పోతున్నారని వివరించారు. ఇక నుంచి రుణాలు మంజూరు చేసే సమయంలో కచ్చితంగా ఆన్‌లైన్ మైక్రో క్రెడిట్ ప్లాన్ ఉంటేనే రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు విన్నవించారు. అదే విధంగా ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్య తరగతి మహిళల ఆర్థిక పరిస్థితులను క్రమబద్ధీకరించేందుకు, వారి జీవనోపాధులను మెరుగు పరిచేందుకు ఏర్పాటు చేసే యూనిట్లుకు విరివిగా రుణాలను మంజూరు చేయాలని మేనేజర్లను కోరారు. ఆయన వెంట సీసీ సుబ్బారావు ఉన్నారు.

మల్లికార్జునపురంలో నడకయాతన





కాలనీలో రోడ్ల దుస్థితి

- బురదమయంగా రహదారులు
- ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిలో దోమలు, వాటివల్ల విషజ్వరాలు

గుంటూరు రూరల్: అధికారుల నిర్లక్ష్యంతో నగర శివారు ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధ్వానంగా మారిన రోడ్లు. చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు.. ఎక్కడ చూసిన దోమల ఆవాసాలతో అవస్థలు పడుతున్నమని 48వ డివిజన్ రెడ్డిపాలెం మల్లికార్జునపురం కాలనీ వాసులు దుస్థితి. చినుకు పడితే రోడ్లు కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా పోయింది. పాఠశాలలకు వెళ్ళే చిన్నారులు, వృద్ధులు బురదలో పడి ఇబ్బందులు పడుతున్నారు. కనీసం పారిశుద్ధ్య కార్మికులు సైతం కాలనీని పట్టించుకోవటంలేదు. కాలనీలోని ఖాళీ ప్లాట్లలో నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయని నిలిచిన నీటిలోని దోమల వల్ల ప్రతి ఇంటికి ఒకరిద్దరు చొప్పున విషజ్వరాలతో ప్రాణాలను అరచేత పెట్టుకుని బతుకుతున్నారు. గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటంలేదని స్థానికులు వాపోతున్నారు.



పెదకాకాని శివాలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



చేబ్రోలు మండలం మంచాలలో గాయత్రీ దేవిగా అమ్మవారు

అన్నపూర్ణాదేవిగా శ్రీభ్రమరాంబ అమ్మవారు

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. శ్రీదేవినవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– పెదకాకాని



పాతరెడ్డిపాలెంలో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం పెద్ద పలకలూరు రోడ్, జేకేసీ కాలేజ్ రోడ్, పట్టాభిపురం, విద్యా నగర్ మెయిన్ రోడ్, కేవీపీ కాలనీ రోడ్, నల్లచెరువు రోడ్, జీటీ రోడ్ లను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని ఆర్ అండ్ బీ, నగరపాలక సంస్థకు చెందిన ప్రతి రోడ్‌లో ఏ విధమైన పాట్ హోల్ ఉండడానికి వీలులేదని, తక్షణం ఏఈల వారీగా తమ పరిధిలోని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్యాచ్ వర్క్‌లు నాణ్యతతో ఉండాలని లేకుంటే సంబంధిత పర్యవేక్షణ కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, ఏఈలు సూరిబాబు, శ్రీకాంత్, నాగవేణి, శానిటరీ సూపర్వైజర్ సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డేవిడ్, బాబు, ఏడుకొండలు పాల్గొన్నారు.

చలపతిలో ముగిసిన దసరా సంబరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్నదృశ్యం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దసరా క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలను భవితరాలకు తెలియజేసే గొప్ప అవకాశాలన్నారు. విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, అధ్యాపకులు కేవీ రామారావు, పి. బాలాజీ, నగగోపి, అరుణ, భార్గవ్, నరేంద్రకుమార్, రాధాకృష్ణమూర్తి, తిరుపతి, లక్ష్మీనారాయణ విజేతలను అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పట్నంబజారు: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. లాలాపేట పోలీసు స్టేషన్ సమీపంలోని తూనుగుంట్ల వారి వీధిలో 35 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో సమాచారం వచ్చింది. అక్కడి వరకు నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి కొట్టుకుని చనిపోవడంతో స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువ మేధ శక్తులను పరిశోధనల వైపు మళ్లించాలి

విజ్ఞాన్‌లో ఘనంగా ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్ ఫర్ రీసెర్చ్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న సంస్థ సీఈఓ గీతా కిరణ్

చేబ్రోలు: యువ మేధను పరిశోధనల వైపు మళ్లించాలని కర్ణాటక – హసన్ ప్రాంతంలోని ఎంఈ– ఆర్ఐఐఎస్ఈ ఫౌండేషన్ సీఈఓ, మల్నాడ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కార్పొరేట్ అఫైర్స్ డీన్ ఎ.గీతా కిరణ్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని మూడో సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం 'ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్ ఫర్ రీసెర్చ్' ప్రోగ్రామ్‌ను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గీతా కిరణ్ మాట్లాడుతూ యువతలో ఉన్న సృజనాత్మకత, జిజ్ఞాస, శక్తిని పరిశోధన వైపు మలచడం అనేది దేశాభివృద్ధికి కీలక అంశమన్నారు. ఈ నేపథ్యంలో యువ మేధ శక్తులను రగిలించి, వారి ఆలోచనలను పరిశోధన రంగంలోకి నడిపించడం ఎంతో ముఖ్యమని చెప్పారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీకి సంబంధించిన ప్రాజెక్ట్‌లు యువతలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు అనువుగా ఉంటాయన్నారు.

చిప్స్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బతుకమ్మ సంబరాలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకుంటారన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బతుకమ్మ పాటలను పాడి వేడుకలు చేశారు. అనంతరం బతుకమ్మలను కాలువలో నిమజ్జనం చేశారు.



బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు అధ్యాపకులు